

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL   ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి   శనివారం 13-12-2025 సంపుటి : 07   సంచిక 216   పేజీలు : 8   వెల : రూ 3-00


# కేంద్ర కేబినెట్ భేటీ..



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జనగణన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వంటి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రివర్గంలో తీసుకున్న అంశాలను వివరించారు.

కీలక నిర్ణయాలు ఇవే..

1. 2027లో రెండు విడతల్లో జరగనున్న జనగణన కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్‌ను కేబినెట్ ఆమోదించింది. ఈ జనగణనను డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి నిర్వహించనున్నారు.

2. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన' గా మారుస్తూ నిర్ణయం

3. ఈ పథకం కింద ఒక కుటుంబానికి ఏడాదికి ఉన్న గరిష్ఠ పని దినాలను 100 నుంచి 120 రోజులకు పెంచింది. రోజు కూలీని రూ.240గా నిర్ణయించింది. రూ.1.51 లక్షల కోట్లు కేటాయింపు.

4. బొగ్గు గనుల్లో పలు సంస్కరణలు తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

5. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన.. ఈ పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది.

6. దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు 4, ఆంధ్రప్రదేశ్ కి 4 మంజూరు చేసింది.

7. నాలుగు కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

8. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఔఅఆఅ కింద రూ.2,000 కోట్ల ఆర్థిక సహాయం

9. పీఎం కిసాన్ సంపద యోజన.. ఈ పథకానికి రూ.6,520 కోట్లు కేటాయింపు.

10. క్వాంటం టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి అదనంగా రూ.4,000 కోట్ల నిధులు కేటాయింపు

11. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఓూఓఇ)లకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు లభించేందుకు వీలుగా రూ.15,000 కోట్లతో కొత్త క్రెడిట్ గ్యారెంటీ పథకానికి గ్రీన్ సిగ్నల్

12. దేశంలోని డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించడనాకి సైబర్ దాడులను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ పాలసీకి ఆమోదం.

13. సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించేందుకు రూ.12,000 కోట్లు కేటాయింపు. కొత్త సెమీకండక్టర్ తయారీ కర్మాగారాలను నెలకొల్పే సంస్థలకు ఆర్థిక సహాయం పెంపు.

## సంచలన నిర్ణయాలివే..

14. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా 1.5 కోట్ల గృహాలను నిర్మించడానికి ఆమోదం

15. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి వీలుగా తమిళనాడులోని కులశేఖరపట్నం వద్ద కొత్త ప్రయోగ వేదిక నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

16. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని రక్షణ రంగంలో బలోపేతం చేయడానికి, రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఈఆఎ) పరిమితి పెంపు

17. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలను అందించడానికి నేషనల్ టెలి-మెడిసిన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ఆమోదం

18. నీటిపారుదల పథకాలకు జాతీయ మిషన్ ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 ప్రధాన, మధ్యస్థ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి రూ.35,000 కోట్లతో ఒక కొత్త జాతీయ మిషన్‌ను ప్రారంభించేందుకు కేబినెట్ లైన్ క్లియర్ చేసింది. 19. భారత్ నెట్ ప్రాజెక్ట్ కింద ఇంటర్నెట్ సేవలు. ఇందుకోసం అదనంగా రూ.8,000 కోట్ల నిధులు కేటాయింపు20. రాష్ట్రాల ఆర్థిక బలోపేతం కోసం ప్రత్యేక ప్యాకేజీ. ఇందులో భాగంగా రాష్ట్రాలు తమ మూలధన పెంచుకోవడానికి.. వడ్డీ లేని రుణాల రూపంలో రూ.1.3లక్షల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీకి గ్రీన్ సిగ్నల్

# సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారు



అమరావతి, డిసెంబర్ 12: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు న్యూఢిల్లీ పర్యటన ఖరారైంది. డిసెంబర్ 18,19 తేదీల్లో ఆయన న్యూఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు వెలగపూడి సచివాలయంలోని హెలిప్యాడ్ నుండి విజయవాడ ఎయిర్‌పోర్టుకు ఆయన చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు ఎయిర్‌పోర్టు నుండి ఢిల్లీకి సీఎం చంద్రబాబు బయలుదేరి వెళ్లనున్నారు. ఆ రోజు రాత్రి 7.45 గంటలకు ఆయన ఢిల్లికి చేరుకుంటారు. అనంతరం 8.30 గంటలకు వన్ జనపథ్‌కు చేరుకుంటారు. ఆ రాత్రి అక్కడే ఆయన బస చేయనున్నారు. 19వ తేదీ సాయంత్రం 6.40 గంటలకు ఢిల్లీ నుండి తిరిగి విజయవాడకు సీఎం చంద్రబాబు పయనం కానున్నారు. 18వ తేదీ రాత్రి.. కేంద్రంలోని పలువురు కీలక నేతలతోపాటు.. ఉన్నత స్థాయి అధికారులను సీఎం చంద్రబాబు కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ మరునాడు సాయంత్రం వరకు సీఎం చంద్రబాబు ఢిల్లీలోనే ఉండనున్నారు. పార్లమెంట్ హౌస్‌లో పలువురు కేంద్ర మంత్రులతో ఆయన సమావేశం కానున్నట్లు సమాచారం. ఏపీకి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్రానికి అవసరమైన కేంద్ర నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులతోపాటు ఆమోదం తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 18వ తేదీ రాత్రి కేంద్రంలోని పలువురు అత్యున్నత స్థాయి నేతలతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారని తెలుస్తోంది. మరోవైపు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 19వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ముందు రోజు సీఎం చంద్రబాబు నాయుడు న్యూఢిల్లీ చేరుకోనున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకొందిఉత్తరాంధ్రలో నిర్మితమవుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఐటీ కంపెనీలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాల్ని ఆయన పరిశీలించారు. అలాగే విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌లో జరుగుతున్న పలు కీలక ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరా తీశారు. ఇక భోగాపురం ఎయిర్ పోర్టు, రాయ్‌పూర్ - విశాఖ జాతీయ రహదారి, తీర ప్రాంతంలోని రహదారులు, కనెక్టివిటీ ప్రాజెక్టులపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

# మహిళా అంధ క్రికెటర్ల విజయం దేశానికే గర్వకారణం: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబర్ 12: ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించిన పవన్.. ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ మాట్లాడుతూ.. మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమన్నారు. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని.. అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక (జట్టు కెప్టెన్), పాంగి కరుణా కుమారి ఉండటం సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇక ఈ సమావేశంలో భాగంగా జట్టు కెప్టెన్ దీపిక తమ గ్రామ సమస్యలను ఉపముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని దీపిక విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పవన్.. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.






# విశాఖకు 5 లక్షల ఐటీ ఉద్యోగాలే లక్ష్యం: మంత్రి లోకేష్




విశాఖపట్నం, డిసెంబర్ 12: అంతర్జాతీయ స్థాయి దిగ్గజ ఐటీ కంపెనీ విశాఖలో అడుగుపెట్టడం చారిత్రాత్మక మైలురాయి అని ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం నాడు విశాఖలో కాగ్నిజెంట్ సహా 9 ఐటీ కంపెనీల శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. విజన్ వాస్తవ రూపం దాలిస్తే కాగ్నిజెంట్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలుగా మారతాయన్నారు. 2025 దావోస్‌లో కలిసి కాగ్నిజెంట్‌ను విశాఖకు ఆహ్వానించామని.. ఇప్పుడు మళ్లీ దావోస్‌కు వెళ్లకముందే ఆ సంస్థ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపారు. నూతన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసిందని అన్నారు. ప్రోత్సాహకంగా ఎకరా భూమిని 99 పైసలకు ఇస్తామని వారికి హామీ ఇచ్చామని.. ఆ మేరకే వారికి భూమి ఇచ్చామని వెల్లడించారు. సీఎం చంద్రబాబుకు 11 నెలలు అంటే సుదీర్ఘ కాలం అని.. ఆయనకు రియల్ టైమ్‌లో నిర్ణయాలు జరగాలని ఆశిస్తారని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు కేబినెట్‌లో మంత్రులందరం స్వేచ్ఛగా రాష్ట్ర అభివృద్ధికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. విశాఖపట్నం ఐటీ, జీసీసీ కేంద్రంగా మారుతుందని.. విశాఖ ఎకనామిక్ రీజియన్ కూడా ఈ ప్రాంత అభివృద్ధిని మారుస్తుందని పేర్కొన్నారు. వై నాట్ వైజాగ్ అనే ప్రశ్న ఉదయించేలా ఐటీ కంపెనీలు, పరిశ్రమల్ని ఈ ప్రాంతానికి ఆహ్వానిస్తున్నామన్నారు. ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ ఈ ప్రాంతానికి వస్తోందని మంత్రి తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో ఊరు చివరగా జూబ్లీహిల్స్ చెక్ పోస్టు ఉండేదని... ఇప్పుడు అక్కడ చెక్ పోస్టు కాదు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలకు ప్రతీకగా మెట్రో స్టేషన్ ఉందన్నారు. తమ ముఖ్యమంత్రి ఓ జీపీఎస్ అని.. నిరంతరం అందరినీ అభివృద్ధి వెంట పరుగులు పెట్టిస్తారని అన్నారు. రాష్ట్రంలో పెట్టిన ప్రతీ ప్రాజెక్టునూ ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి చేయూత అందిస్తామని చెప్పామని... ఇప్పుడు కాగ్నిజెంట్‌కు కూడా అదే స్థాయి ప్రోత్సాహం అందిస్తామని స్పష్టం చేశారు. కాగ్నిజెంట్‌లో పనిచేసే ఉద్యోగులంతా విశాఖ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని సూచించారు. 5 లక్షల ఐటీ ఉద్యోగాలు ఈ ప్రాంతానికి వచ్చేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ భారత్‌ను అభివృద్ధిబాటలో నడుపుతుంటే ఏపీని సీఎం చంద్రబాబు నాయుడు పురోగతి బాట పట్టిస్తున్నారని అన్నారు.

# సంపాదకీయం

శనివారం 13-12-2025

## ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద

దేశ ఆదాయంలో 58%.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. భారత్‌లోని 40 శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద ఉంది. భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94 శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం.. – 2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. – నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు. ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10% వర్గం సుమారు 65% సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది. ఆదాయ అసమానలతు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58% ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న 50% వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15% మాత్రమే దక్కుతోంది. 2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్ 10% వర్గం, బాటమ్‌లోని 50% వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి. భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7% మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది. ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలు స్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది. 140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 13–14 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా, ప్రజల ఆదాయ స్థాయిలను, ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు. దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగత ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది. విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారత మార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి.

## ఈ–సిగరేట్ వ్యవహారం.. టీఎంసీపై ఫిర్యాదు చేసిన బీజేపీ ఎంపీ

పార్లమెంట్ సమావేశాల్లో ఈ–సిగరెట్ వ్యవహారం దుమారం రేపింది. లోక్‌సభలో టీఎంసీ ఎంపీ ఈ–సిగరెట్ తాగారని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. తాజాగా ఈ వివాదం కొత్త మలుపు తీసుకున్నది. టీఎంసీపై అనురాగ్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. టీఎంసీ ఎంపీ పార్లమెంటరీ రూల్స్‌ను, చట్టాలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పీకర్‌ను కోరారు. ఈ–సిగరెట్లపై కొనసాగుతున్న వివాదం మధ్య.. గురువారం



పార్లమెంట్ ఆవరణలో టీఎంసీ సీనియర్ ఎంపీ సౌగతా రాయ్ ధూమపానం చేస్తూ కనిపించారని అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. దేశంలో చాలాకాలంగా వాటిపై నిషేధం అమలులో ఉందని.. టీఎంసీ ఎంపీ అనుమతి తీసుకున్నారా? అని స్పీకర్‌ను అడగ్గా.. లేదని ఓం బిర్లా సమాధానం ఇచ్చారు. కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, గజేంద్ర సింగ్ సైతం అనురాగ్ ఠాకూర్‌కు మద్దతు తెలుపుతూ.. ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సౌగతా రాయ్ స్పందిస్తూ సిగరేట్ బయట తాగొచ్చని సౌగతా రాయ్ పేర్కొనగా గజేంద్ర సింగ్ జోక్యం చేసుకొని.. 'ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నావ్. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం శిక్షార్హమైన నేరం. ఒక ఎంపీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో ఆలోచించాలి' అన్నారు. అయితే, 2019లో ఈ–సిగరేట్లను నిషేధించారని, పార్లమెంట్ ఆవరణలో ఎంపీ వాటిని ఉపయోగిస్తే అది సభ గౌరవానికి అవమానమని కేంద్రమంత్రులు పేర్కొన్నారు. అయితే, టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ఇది చిన్న విషయమంటూ తోసిపుచ్చారు. ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని కోరారు. తాను సభలో లేనని.. ఎవరు ఫిర్యాదు చేశారో తనకు తెలియదన్నారు. ఇది స్పీకర్‌కు సంబంధించిన విషయమన్నారు. పార్లమెంట్ వెలుపల ధూమపానం వెలుపల ధూమపానం అనుమతి ఉంటుందని.. లోపల కాదని రాయ్ స్పష్టం చేశారు. టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ ఈ విషయంలో బీజేపీ ఆరోపణలను మండిపడ్డారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో వందలాది మంది ఎంపీలు ధూమపానం చేస్తున్నారని ఆజాద్ విమర్శించారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అనురాగ్ ఠాకూర్ టీఎంసీ ఎంపీపై ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి దర్యాప్తుకు ఆదేశించాలని ఠాకూర్ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. నిబంధనల ఉల్లంఘనను సహించబోమని, సభ నిబంధనల ప్రకారం దర్యాప్తు నిర్వహిస్తామని స్పీకర్ ఆయనకు హామీ ఇచ్చారు.

## బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించండి : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 12 : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి, పెద్దగూడెం, జూలూరు, కప్రాయపల్లి, పెద్ద రావులపల్లి, గౌస్ కొండ, రామలింగంపల్లి, ఇంద్రియాల, దంతూరు, జిబ్లక్ పల్లి, కనుముకుల, భీమనపల్లి, హైదర్ పూర్, జలాల్ పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా రోడ్ షో నిర్వహించి మాట్లాడారు. మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి, 420 హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని, కాంగ్రెస్ కు ఓటు వేసి ప్రజలు మోసపోయారని, రెండు సంవత్సరాలలో అభివృద్ధి ఏం జరగలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించలేక స్థానిక ఎమ్మెల్యే వన్ ప్లస్ వన్ బంపర్ ఆఫర్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ పాక వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకుడు కోట మల్లారెడ్డి, సర్పంచ్ అభ్యర్థులు ఫకీరు ఇందిరా సుధాకర్ రెడ్డి, వట్టిపల్లి బాలరాజు, రాగీరు నర్మదా సత్యనారాయణ, పూల శేఖర్, ధరావత్



వెంకటేశ్, లింగాల మధు, మండల రెనమ్మ, బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, సామ రవీందర్ రెడ్డి, కర్నాటి వరలక్ష్మి, ఆర్ల వెంకటేష్, నాయకులు రంగ విశ్వనాథం, అందెలా హరీష్, యాకరి నర్సింగ్ రావు, ఐతరాజ్ భిక్షపతి, నోముల మాధవరెడ్డి, బండి కృష్ణ గౌడ్, పెద్దిరెడ్డి యాదగిరి, గరిసే జంగయ్య, సిద్దగోని లింగస్వామి, సిలువేరు శేఖర్ పాల్గొన్నారు.

## జనమే లేని ఊరిలో ఎన్నికలు

**సింగరేణి ఓసీ విస్తరణలో వెంకటేష్ ఖని గ్రామం మాయం**

**తలో దిక్కుకు గ్రామస్తులు**

**రెండో విడుతలో అక్కడ పోలింగ్ నిర్వహణ**

**జనం, ఓటర్లు లేని చోట ఎన్నికలు ఎలా అని అంతా విస్మయం**



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 12 : సింగరేణి ఓసీ విస్తరణలో అక్కడ ఊరు మాయం అయింది. దీంతో అక్కడ ఉన్న కుటుంబాలు తలోదిక్కయ్యాయి. కానీ ఇప్పుడు ఆ గ్రామానికి ఎన్నికలు వచ్చాయి. మరి ఎవరు పోటీ చేస్తున్నారు. ఎవరు బరిలో ఉన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం ఎక్కడ చేస్తున్నారు అనేది విచిత్ర పరిస్థితి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం వెంకటేష్ ఖని గ్రామం. అక్కడ 183 జనాభా, 179 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 79 కుటుంబాలు. గత మూడేళ్ల క్రితం ఆ గ్రామం ఓపెన్ కాస్ట్ ద్వారా బొగ్గు వెలికితీత కోసం సింగరేణి ఓసీ ఏర్పాటు చేయబోతుంది. దీంతో ఆ గ్రామాన్ని అధికారులు ఖాళీ చేయించాల్సి వచ్చింది. అప్పటికే చాలామంది తలోదారి చూసుకున్నారు. కానీ సింగరేణి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో కొంత స్థలాన్ని వారికి కేటాయించడంతో ప్రభుత్వం వారికి స్థలాలను ఇచ్చింది. అయితే ఇంటి నిర్మాణాలు జరగలేదు. దీంతో అక్కడ ఉన్న కుటుంబాలు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లిపోయాయి. ఎక్కడ ఉంటున్నారంటే కొంత మంది అడ్రస్ తెలిసినా మరికొంత మంది అడ్రస్ తెలియడం లేదు. మూడేళ్ల క్రితమే అక్కడ ఊరు లేదు. కుటుంబాలు చుంచుపల్లి మండలంతో పాటు పట్టణ ప్రాంతాల్లో అద్దె నివాసాల్లో ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. కాని పూర్తి సమాచారం అధికారుల వద్ద లేదు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. అధికారులు తప్పిదంతో వాళ్లకి ఓట్లు కూడా వచ్చేశాయి. కాని అక్కడ ఊరు లేదు. నాయకులకు పదవులు కావాలి కాబట్టి సర్పంచ్, వార్డు మెంబర్లకు పోటీ చేసేందుకు ఓటర్ల జాబితాలో వ్యక్తులను రప్పించుకుని నామినేషన్లను వేయించారు. సర్పంచ్ పదవికి ముగ్గురు, 4 వార్డులకు 10 మంది అభ్యర్థులను బరిలో ఉంచారు. రెండవ విడత పోలింగ్ జరగాల్సి ఉంది. ఓటర్లు ఎక్కడ ఉన్నారో తెలియదు. ప్రచారం ఎవరు ఎక్కడ చేస్తున్నారో తెలియదు. మరి పోలింగ్ రోజు ఈ 14వ తేదీన ఓటర్లను ఎవరు తీసుకు వస్తారంటే ఎవరికి అంతుచిక్కని విషయం. అసలు అక్కడ ఊరు లేదు. కాని ఓటర్ల జాబితాలో మాత్రం అక్కడ ఓటర్లు ఉన్నట్లు లెక్కలు చూపిస్తున్నారు. మూడేళ్ల క్రితం అక్కడ నుండి జనం బయటకు వెళ్లిపోతే ఓటర్ల సవరణలో వాళ్లను ఎందుకు వేరే ప్రాంతాలకు షిఫ్ట్ అయినట్లు చూపించలేదో అర్థంకాని విషయం. మరి అధికారులకు తెలుసా లేక అసలు అధికారులు ఆ గ్రామానికి ఇంత వరకు వెళ్లలేదా. ఎన్నికల అధికారులు చేర్పులు మార్పుల సవరణలో వారి విషయం ఎందుకు మరిచి పోయారో అంతుచిక్కని విషయంగా మిగిలిపోయింది. నాయకులు పంచాయతీని దక్కించుకోవడం ఓటర్లను అక్కడ ఉంచారా లేక పంచాయతీకి నిధులు వస్తే మింగేయాలనా అర్థంకాని విషయం.

## రాహుల్ సమావేశానికి శశిథరూర్ గైర్హాజరు.. వరుసగా మూడోసారి



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ వ్యవహారం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూనే.. ప్రధాని మోదీ, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో సొంత పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తూ, పార్టీ సమావేశాలకు దూరంగా ఉంటూ నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తున్నారు. తాజాగా థరూర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇవాళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన పార్టీ సమావేశానికి థరూర్ డుమ్మా కొట్టారు. లోక్‌సభ శీతాకాల సమావేశాలు వచ్చే వారం ముగియనున్న నేపథ్యంలో పార్టీ పనితీరును సమీక్షించేందుకు, సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు నేడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ ముఖ్యమైన భేటీకి థరూర్ హాజరు కాలేదు. ప్రస్తుతం తాను కోల్‌కతాలో ఉన్నట్లు థరూర్ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇలా పార్టీ కీలక భేటీలకు థరూర్ హాజరు కాకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. నవంబర్ 30న సోనియా గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి, నవంబర్ 18న ఖర్గే, రాహుల్ నేతృత్వంలో జరిగిన భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు.

## అడుగడుగున గుంతల మయం.. కంకర రోడ్డుపై ప్రయాణం అయోమయం



నార్నూర్ : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం మారేగావ్ నుంచి కొలమ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు(కంకర తేలి అడుగు అడుగున గుంతల మయంగా మారింది. హీరాపూర్, పర్సవాడ, తోయాగూడా, కొలాము, బుద్ధ గూడా గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో వాహనాలు మరమ్మతులకు గురి అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణం నరకంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## సీఎం మార్పు ఊహాగానాల వేళ విందు రాజకీయాలు.. ఎమ్మెల్యేలు, మంత్రులకు డీకే డిన్నర్ పార్టీ

న్యూఢిల్లీ: కర్ణాటకలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. గత కొన్ని రోజులుగా కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు ఊపందుకున్న విషయం తెలిసిందే. ఈ ఊహాగానాల వేళ విందు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఇటీవలే సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ ఒకరింటికి ఒకరు వెళ్లి బ్రేక్‌ఫాస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ డిన్నర్ పార్టీ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. బేలాలో పార్టీ నేత ప్రవీణ్‌కు చెందిన



ఫామ్ హౌస్‌లో గురువారం రాత్రి జరిగిన ఈ విందు భేటీలో దాదాపు 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పలువురు మంత్రులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. అంతకుముందు సీఎం సిద్ధరామయ్య కూడా పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులతో డిన్నర్ చేయడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు. ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాల వేళ సీఎం, డిప్యూటీ సీఎం ఇలా వేర్వేరు డిన్నర్ మీట్‌లు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి.

## జీతాలు పెంచాలని మహిళా కార్మికుల ధర్నా

మేడ్చల్,నాచారం పారిశ్రామిక వాడలో ఉన్న షాహి ఎక్స్‌పోర్ట్స్ గార్మెంట్ సంస్థలో పని చేస్తున్న మహిళా కార్మికులు తమకు జీతాలు పెంచాలని చేస్తున్న ధర్నా కార్యక్రమం నేటికి 5వ రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించి పరిశ్రమ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా కార్మికులకు సీపీఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నారాయణ ధర్నాలో పాల్గొని కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 4 రోజులగా మహిళా కార్మికులు ఎండలో కూర్చొని తమకు న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం సరికాదన్నారు. కంపెనీలో పని చేస్తున్న మహిళలకు కనీసం గౌరవం ఇవ్వకుండా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అలా ప్రవర్తించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే మహిళా కార్మికులకు వారి పనికి తగ్గ జీతం పెంచాలన్నారు.

# మళ్లీ మొదటికొచ్చిన వివేకా కేసు



కడప, డిసెంబర్ 12 వైఎస్ వివేకా హత్య కేసు క్లైమాక్స్‌లో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కు..ఆల్ మోస్ట్ దర్యాప్తు కంప్లీట్..అయినా ఇంకా ఎక్కడో డౌట్ అన్నట్లుగా కొనసాగుతోన్న వివేకా హత్య కేసు వివాదం ఎంతకు కొలిక్కి రావడం లేదు. వివేకా కూతురు సునీత న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. లేటెస్ట్‌గా ఆమె లేవనెత్తిన పలు అంశాలపై దర్యాప్తునకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే వివేకా హత్య కేసులో నిందితుల ఫోన్ కన్వర్జేషన్ కీలక ఆధారంగా మారింది. ఇప్పటికే వివేకా హత్య కేసు తొలి దర్యాప్తు అధికారి సీఐ శంకరయ్యను ఏపీ సర్కార్ డిస్మిస్ చేసింది. వివేకా హత్య జరిగినప్పుడు పులివెందుల సీఐగా ఉన్న శంకరయ్య.. సాక్ష్యాధారాలు చేరిపివేస్తున్నా చూస్తూ ఊరుకున్నారన్న ఆరోపణలను ఫేస్ చేస్తున్నారు. అయితే ఈ ఎపిసోడ్ ఇలా ఉండగానే లేటెస్ట్‌గా సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఆసక్తికరంగా మారాయి.వివేకా హత్య కేసులో ఇన్ డీటేయిల్డ్ దర్యాప్తు జరగలేదని, పలు అంశాలపై దర్యాప్తు అసంపూర్తిగా ఉందని నిందితులు చెప్తున్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సీబీఐ కోర్టును కోరారు సునీతారెడ్డి. వివేకా హత్య కేసులో మిగతా దర్యాప్తు కంటిన్యూ చేయాలంటూ సునీత వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీబీఐ కోర్టు..కీలక ఆదేశాలు ఇచ్చింది.వివేకా హత్య కేసులో కొన్ని అంశాలపై రీఇన్వెస్టిగేషన్‌కు సీబీఐ కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు డైరెక్షన్‌లో కేసును మళ్లీ విచారించాలని వివేకా కూతురు సునీత సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు..కొన్ని అంశాలపై మాత్రం ఇన్వెస్టిగేషన్‌కు అనుమతులు ఇచ్చింది. ం2 సునీల్ యాదవ్ బ్రదర్ కిరణ్, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడి కుమారుడు అర్జున్ రెడ్డి ఫోన్ సంభాషణపై దర్యాప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. నెల రోజుల్లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించింది.సీబీఐ కోర్టు ఉత్తర్వులు ప్రకారం వివేకా హత్య కేసులో మళ్లీ పాక్షిక దర్యాప్తు జరగనుంది. ఆ ఇద్దరి ఫోన్ కన్వర్జేషన్‌పై దర్యాప్తునకు సీబీఐ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ కేసులో సునీత వ్యక్తం చేసిన అన్ని సందేశాలపై కోర్టు విచారణకు అనుమతించలేదు. అంతేకాకుండా పాక్షిక దర్యాప్తును నెలరోజుల్లో పూర్తి చేయాలని కూడా కోర్టు చెప్పడం ఉత్కంఠ రేపుతోంది.అయితే సునీత వ్యక్తం చేస్తున్న డౌట్స్‌పై కోర్టు విచారణకు ఆదేశించకపోవడం..నిందితులకు కాస్త రిలీఫేనన్న చర్చ జరుగుతోంది. హత్య జరిగిన రోజు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ నుంచి వైసీపీ పెద్దలకు ముందే సమాచారం ఇచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు సునీత. ఈ విషయంపై దర్యాప్తు జరపలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రిటైర్డ్ ఐఏఎస్ అజేయ్ కల్లం తన వాంగ్మూలంలో ఉదయం 5 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్‌లో తాము జగన్‌తో సమావేశంలో ఉండగా, భారతి నుంచి జగన్‌కు పిలుపు వచ్చిందని, ఆ తర్వాత జగన్ తమతో వివేకా మరణంపై చెప్పారని అజేయ్ కల్లాం వాంగ్మూలమిచ్చారని గుర్తు చేశారు సునీత.అయితే భారతికి ఎలా సమాచారం వచ్చింది.? ఎవరి నుంచి వచ్చిందన్న అంశంపై సీబీఐ దర్యాప్తు చేయలేదని, ఆ అంశాలపై దర్యాప్తు చేయాలని సునీత కోరారు. కేసు విచారణను సీబీఐ సగంలోనే వదిలేసిందని, నిందితులు పొంతన లేని వాంగ్మూలాలు ఇవ్వడంపైనా సీబీఐ దృష్టిపెట్టలేదని సునీత అభ్యంతరం వ్యక్తం చేశారు.అయితే కోర్టు మాత్రం సునీత లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం అర్జున్ రెడ్డి, కిరణ్ యాదవ్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తునుకు ఆదేశించింది. హత్య జరిగిన రోజు తెల్లవారుజామున 1.42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి..వివేకా సర్ చనిపోయాడనే మెసేజ్ వెళ్లిందని సీబీఐ గుర్తించింది. కానీ, ఆ మెసేజ్‌పై దర్యాప్తు చేయలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఈ విషయంపైనే దర్యాప్తు కొనసాగనుంది.

# చంద్రబాబు తర్వాతే లోకేష్, పవన్

విజయవాడ, డిసెంబర్ 12, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపాలనలో ప్రతి నిర్ణయం గణాంకాలకు ఆధారపడిందనే విషయం అధికార యంత్రాంగం మాత్రమే కాదు, ప్రజలకూ తెలిసిందే. మాటలు కాకుండా వాస్తవాలు, డేటా ఆధారిత వివరాలు ప్రజల ముందు ఉంచడం ఆయన ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పద్ధతి. ఇదే విధానంతో ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో కూడా సీఎం చంద్రబాబు వివిధ శాఖల ఫైల్ క్లియరెన్స్ వివరాలను బహిర్గతం చేశారు. ఎవరు ఎంత వేగంగా ప్రజాసంబంధ ఫైళ్లను పూర్తి చేశారో అంకెలతో వివరించడంతో అధికారులు, మంత్రులు అందరూ మరింత అప్రమత్తమయ్యారు.మంత్రుల పనితీరును పరిశీలిస్తూ విడుదల చేసిన ఈ సమాచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరో స్థానంలో ఉండడం ప్రత్యేకంగా కనిపించింది. ఆయన తరువాత స్థానాల్లో నారా లోకేష్ తొమ్మిదవ స్థానంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదకొండవ స్థానంలో ఉన్నారు. అయితే ఈ ముగ్గురికంటే ముందుగా ఐదుగురు మంత్రులు ఫైళ్ల పరిశీలనలో వేగం ప్రదర్శించడం గమనించదగిన విషయం. మొదటి స్థానాన్ని డోలా బాల వీరాంజనేయ స్వామి దక్కించుకున్నారు. ప్రజల నుండి వచ్చిన ఫైళ్లను ఆయన సగటుగా రెండు రోజులు 41 నిమిషాల్లో పరిష్కరించడం ఈ ర్యాంక్‌కు ప్రధాన కారణం. మొత్తం 651 ఫైళ్లను క్లియర్ చేసి ముందంజలో నిలిచారు.ఆ తరువాత స్థానాల్లో నిమ్మల రామానాయుడు, ఎన్.ఎస్.డి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, పొంగూరు నారాయణ ఉన్నారు. అదే సమయంలో ఫైల్ క్లియరెన్స్ లో ఆలస్యంగా ఉన్న చివరి ఐదు స్థానాలను కొలుసు పార్థసారథి నాదెండ్ల మనోహర్ , పయ్యావుల కేశవ్ , కొల్లు రవీంద్ర, మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆక్రమించారు.సమీక్షలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా అందించేలా వ్యవస్థ సిద్ధం అవుతుందని చెప్పారు. కొంతమంది శాఖలు ఇప్పటికీ భౌతిక విధానంలో సేవలు అందిస్తున్నాయని, వెంటనే డిజిటల్ పద్ధతులకు మారాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ఏ సేవకైనా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా "మనమిత్రా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి తెస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ సేవల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలనీ కూడా ఆదేశించారు.డేటాను ఆధారంగా చేసుకుని పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వేగవంతమైన ఫైల్ క్లియరెన్స్‌తో పారదర్శకతకు మరొక మెట్టు వేసినట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మీకు స్మార్ట్ రేషన్ కార్డు

ఏలూరు, డిసెంబర్ 12 ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రేషన్ అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమార్కులకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఆగస్టు నుంచి వీటిని పంపిణీ చేస్తోంది ఏపీ. ఇప్పటికే చాలా వరకు పంపిణీ చేసింది.గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులకు అప్పగించే బాధ్యతను ఇచ్చింది. అంతేకాదు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. ఈ నెల 15వ తేదీ వరకు పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. అయితే చాలా మంది లబ్ధిదారులు ఇంకా వాటిని తీసుకోలేదు. వేలాది కార్డులు పంపిణీ చేయలేదు. 15వ తేదీ తర్వాత వాటిని కమిషనరేట్‌కు పంపనున్నారు.గడువు దగ్గరకు వచ్చినా.. సరే అర్హులైన కొందరు స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోలేదు. ఇంకా చాలా కార్డులు పంపిణీ కోసం ఎదురుచూస్తున్నాయి. కొందరికి కార్డులు తీసుకోవాలని సమాచారం ఇస్తున్నా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది, డీలర్లు వారికి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేసిన కొన్ని ప్రాంతాల్లో కుదరడం లేదు.అయితే ప్రస్తుతం అందుబాటులో లేకుండా ఉన్నవారు స్మార్ట్ రేషన్ కార్డు తీసుకోకపోవడంపై ఆందోళనలో ఉన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుంది. ఒకవేళ కార్డులు తీసుకోకుంటే రద్దు చేస్తారని చాలా మంది అపోహలో ఉన్నారు. కానీ ప్రభుత్వం ఆ విధంగా చేయదు.సచివాలయాల్లో చిరునామాతోపాటుగా స్మార్ట్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.200 రుసుము చెల్లించాలి. తర్వాత కమిషనరేట్ నుంచి చిరునామాకు రేషన్ కార్డు పంపిస్తారు. ఈ పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను స్వైప్ చేయగానే.. లబ్ధిదారుల వివరాలు కనెక్ట్ అవుతాయి. బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ ద్వారా కూడా స్కాన్ చేసి సరకులు అందిస్తారు.

# ప్రతి వ్యక్తికి ఆరోగ్యం మొదటి ప్రాధాన్యం కావాలి

## - ది అపోలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు

చిత్తూరు, డిసెంబర్ 12: యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డేను పురస్కరించుకుని ది అపోలో యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆరోగ్య వ్యవస్థల బలోపేతం, ఆరోగ్య అవగాహన, వైద్య సేవల అందుబాటు వంటి అంశాలపై దృష్టి సారించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు మాట్లాడుతూ, "ప్రతి వ్యక్తి ముందుగా తన ఆరోగ్యానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ముందస్తు జాగ్రత్తలు ఎంతో కీలకం" అని అన్నారు. అలాగే హెల్త్ సర్వీసులు, ఇన్సూరెన్స్ పాలసీ వంటి అంశాలపై ప్రతి ఒక్కరికి స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. ఆరోగ్య రంగంలోని సమగ్ర జ్ఞానాన్ని అందించడంలో అపోలో గ్రూప్ సరైన వేదికగా నిలుస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి ఫీల్డ్‌లోకి అడుగుపెడుతున్న విద్యార్థులు సేవాభావంతో సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించాలని రిజిస్ట్రార్ సూచించారు.ముఖ్య వక్తగా పాల్గొన్న స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల యూనివర్సల్ హెల్త్ కవరేజ్ ప్రాధాన్యతను వివరించారు. ప్రతి వ్యక్తికి నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని, ఈ బాధ్యత ప్రభుత్వాలు మరియు ఆరోగ్య సంస్థలపైన ఉందని పేర్కొన్నారు. ఆరోగ్య సేవల్లో సమాన హక్కు, ఆర్థిక భద్రత, బలమైన వైద్య వ్యవస్థలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లిక్కర్ కేసు... జయచంద్రారెడ్డి అరెస్ట్

విజయవాడ, డిసెంబర్ 12 ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఎట్టకేలకు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలుగుదేశం పార్టీ బహిష్కృత నేత దాసరపల్లి జయచంద్రారెడ్డిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయన్ను బెంగళూరులో అదుపులోకి తీసుకుని, విచారణ నిమిత్తం రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ అరెస్టుతో కేసు విచారణ తుది దశకు చేరుకుందని భావిస్తున్నారు.ములకలచెరువు కేంద్రంగా సాగిన ఈ నకిలీ మద్యం దందా కేవలం ఒక చిన్న తరహా నేరం కాదు. ఇది ఒక వ్యవస్థీకృత నేరంగా ఎక్సైజ్ శాఖ గుర్తించింది. ప్రముఖ బ్రాండ్ల పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే భారీ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. ఈ దందా వెనుక ప్రధాన సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావుకు, జయచంద్రారెడ్డికి మధ్య ఉన్న చీకటి ఒప్పందాలే ఈ సామ్రాజ్యం విస్తరించడానికి కారణమని దర్యాప్తులో తేలింది.పోలీసుల రిమాండ్ రిపోర్ట్, ప్రాథమిక విచారణ ప్రకారం జయచంద్రారెడ్డి పాత్ర ఈ కేసులో చాలా కీలకం. నకిలీ మద్యం తయారీకి అవసరమైన భారీ పెట్టుబడిని, మౌలిక వసతులను సమకూర్చడంలో జయచంద్రారెడ్డి ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు



ఉన్నాయి. తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, అధికారుల కళ్లు గప్పి ఈ దందాను నిరాటంకంగా సాగించడంలో అద్దేపల్లి జనార్దన్ రావుకు అండదండలు అందించారని పోలీసులు పేర్కొన్నారు. కేవలం పెట్టుబడికే పరిమితం కాకుండా, మద్యం తయారీ, రవాణా వ్యవహారాలన్నీ జయచంద్రారెడ్డి కనుసన్నల్లోనే సాగినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది.జయచంద్రారెడ్డి అరెస్ట్ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన వెంటనే తెలుగుదేశం పార్టీ ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. తద్వారా అవినీతి, అక్రమాల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్టానం స్పష్టమైన సంకేతాలిచ్చింది. వాస్తవానికి ఎన్నికల ముందే జయచంద్రా రెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ తరపున తంబళ్లపల్లె నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపుతోంది. సొంత పార్టీకి చెందిన వారైనప్పటికీ, తప్పు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పడానికి ఈ అరెస్ట్ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఈ కేసులో ఇప్పటివరకు 31 మందిని అరెస్ట్ చేయగా, జయచంద్రారెడ్డి అరెస్టుతో ఆ సంఖ్య 32కి చేరింది. ఆయన్ను మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి లోతుగా విచారించనున్నారు .ములకలచెరువు ఘటన కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా, రాష్ట్రంలోని ఎక్సైజ్ వ్యవస్థలోని లోసుగులను, రాజకీయ నాయకుల అండతో చెలరేగిపోయే మాఫియా తీరును బయటపెట్టింది. జయచంద్రారెడ్డి అరెస్ట్ ఈ కేసులో న్యాయం జరగడానికి, భవిష్యత్తులో ఇటువంటి ప్రాణాంతక దందాలు పుట్టకుండా అడ్డుకట్ట వేయడానికి ఒక కీలక ముందడుగు. ఇప్పుడు అందరి దృష్టి మదనపల్లెలో జరగబోయే విచారణపైనే ఉంది.

# సంక్రాంతి తర్వాత గ్రామం తరలింపు

శ్రీకాకుళం, డిసెంబర్ 12 శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు పనులు వేగవంతం అయ్యాయి. పునరావాస గ్రామాన్ని సంక్రాంతి తర్వాత తరలించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆర్డీవో పనులను పరిశీలించి ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు మూలపేట పోర్ట్ నిర్మాణంపై కాంట్రాక్టు సంస్థ ప్రభుత్వానికి రిక్వెస్ట్ చేసింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా గడువు పొడిగింపు కోరగా.. 2026 నవంబర్ 30 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం షరతు విధించింది.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్ట్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. అయితే మూలపేట పోర్టు పునరావాస గ్రామం తరలింపుపై క్లారిటీ వచ్చింది. సంక్రాంతి పండుగ తర్వాత నౌపడ పునరావాస కాలనీకి మూలపేట పోర్ట్ పునరావాస గ్రామాన్ని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నౌపడలోని ఆర్అండ్ఆర్ కాలనీలో జరుగుతున్న పనులను ఆర్డీవో ఎం కృష్ణమూర్తి స్వయంగా పరిశీలించారు. పునరావాస పనుల్లో ఆలస్యం జరుగుతోందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్కూల్, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాల విషయంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులు ఎప్పుడు మొదలుపెడతారని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు.స్కూల్, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు ప్రారంభించడానికి ఎంత టైం కావాలని మండిపడ్డారు. వారం రోజుల్లోపు ఆర్అండ్ఆర్ కాలనీలో ఎట్టి పరిస్థితుల్లో అన్ని పనులు ప్రారంభం కావాలని ఆర్డీవో ఆదేశించారు. నౌపడలో కాలనీలో ఇంటింటికీ కుళాయి పాయింట్లతో పాటుగా జనాలకు అవసరమైన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్డీవో ఎం కృష్ణమూర్తి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణకు సూచించారు. మూలపేటలో ఉంటున్న 75 మంది నిరుపేదలను గుర్తించామని.. వారందరికీ ఉచితంగా ఇంటి నిర్మాణ సామగ్రి అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాదు పునరావాస కాలనీలో నాలుగు చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీ వాసుల కోసం నౌపడలో శ్మశానవాటిక పనులు కూడా త్వరలోనే చేపడతామన్నారు ఆర్డీవో కృష్ణమూర్తి.మూలపేట పోర్టు నిర్మాణంలో జాప్యంపై కాంట్రాక్టు సంస్థ మరి కొన్ని రోజులు గడువు కోరింది. తాము పోర్టు నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోవడానికి ప్రకృతి వైపరీత్యాలను కారణంగా చూపింది. తుఫాన్లు, ఎడతెరిపిలేని వర్షాలు తమ పనులకు ఆటంకం కలిగించాయని సంస్థ పేర్కొంది. అందుకే మూలపేట పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తమకు అదనంగా 409 రోజుల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని పరిశీలించి, కాంట్రాక్టు సంస్థకు గడువు పొడిగించడానికి అంగీకరించింది. అయితే, పోర్టు నిర్మాణాన్ని తప్పనిసరిగా 2026 నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని షరతు విధించింది. నిర్మాణంలో జరిగిన జాప్యం వల్ల పెరిగిన అదనపు ఖర్చులను తాము భరించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు ఈ పోర్ట్ నిర్మాణ పనుల్ని మరింత వేగవంతం చేశారు.. వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు పోర్టు పనుల్ని పరిశీలించారు.శ్రీకాకుళం జిల్లాలో కీలకమైన మూలపేట పోర్ట్ పనులు వేగవంతం అయ్యాయి. పోర్ట్ నిర్మాణంలో కీలకమైన వాటర్ బ్రేక్ తొలి దశ పూర్తయింది. 2,300 మీటర్ల సౌత్ వాటర్ బ్రేక్ వాల్, 580 మీటర్ల నార్త్ వాటర్ బ్రేక్ వాల్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం కొండ రాళ్లు, ఇండో పార్ట్స్ అమరిక పనులు జరుగుతున్నాయి. షిప్‌లు నిలిపే బెర్తుల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. పోర్ట్ నిర్మాణంలో భాగంగా, బెర్త్‌ల వద్ద కాలువలు తవ్వడానికి రోజుకు 30 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని మూడు డ్రెడ్జింగ్ యంత్రాలతో తొలగిస్తున్నారు. త్వరలోనే అత్యాధునిక డ్రెడ్జర్లను విదేశాల నుంచి తీసుకురానున్నారు. ఈ డ్రెడ్జర్లు మరింత వేగంగా, సమర్థవంతంగా మట్టిని తొలగించడంలో సహాయపడతాయి.షిప్‌లు నిలిపే బెర్తుల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.. ప్రస్తుతం ఫైలింగ్ దశ నుంచి బీమ్స్ దశకు వచ్చింది. పిల్లర్లను నాలుగు బెర్తుల్లో 64 మీటర్ల లోతు నుంచి ఏర్పాటు చేశారు. తూర్పు వైపున మూడు జనరల్ బెర్తులు, పశ్చిమాన ఒక కోల్ బెర్త్ నిర్మించనున్నారు. ఇప్పటికే రెండు జనరల్ బెర్తుల పనులు దాదాపు పూర్తయ్యాయి. అంతేకాదు కోల్ బెర్త్ ఫైలింగ్ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఈ పోర్ట్ నిర్మాణం పూర్తయితే, శ్రీకాకుళం జిల్లాకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది.కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో మూలపేట పోర్టు నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పోర్ట్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. పోర్టు నిర్మాణంలో 60 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అనుకున్న సమయానికి పోర్టును అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్నారు. పోర్టుకు వెళ్లే రోడ్డు నిర్మాణంపై కూడా ఫోకస్ పెట్టారు.. ఈ మేరకు అక్కడ గ్రావెల్ పనులు పూర్తయ్యాయి. నౌపడలో ఒక ఫ్లైఓవర్, క్రీక్ దగ్గరకు దారిని ఏర్పాటు చేయాల్సి ఉంది. మూలపేట పోర్టు నుంచి రైల్వే ట్రాక్ లైన్ కోసం మట్టి చదును చేసే పనులు స్పీడ్ అందుకున్నాయి. కూర్మనాథపురం, యామలపేట, పోతునాయుడుపేట, కోటపాడు గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయి. నౌపడలో విద్యుత్ సౌకర్యం కోసం స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. పోర్టుకు సంబంధించిన పరిపాలన భవనాలు, నాలుగు పెద్ద గోదాముల నిర్మాణం ప్రారంభమైంది. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించాలని భావిస్తున్నారు.

# ట్రాఫిక్ సమస్యలకు చెక్

తిరుపతి, డిసెంబర్ 12 తిరుపతి అభివృద్ధికి తగ్గట్టుగానే ట్రాఫిక్ కూడా భారీగా పెరుగుతోంది. స్థానికంగా విస్తరిస్తున్న నగరం, వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఇబ్బంది పెడుతోంది. అందుకే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సిద్ధమవుతోంది తుడా. దీనికి సంబంధించిన ప్రక్రియను కూడా ప్రారంభించింది. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ దివాకర్ రెడ్డి అధికారులతో కలిసి తిరుపతిలో పర్యటించారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదించిన ప్రాంతాల్లో తిరిగి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తిరుపతి గ్రామీణ, చంద్రగిరి,రామచంద్రాపురం, రేణిగుంట, వడమాలపేట మండలాల్లో ప్రాంతాలను ఆయన చెక్ చేశారు. దాదాపు 90 కిలోమీటర్ల మేర ఈ ఔటర్ రింగ్ రోడ్డును ప్రారంభించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాంతాల్లో సర్వే కూడా ప్రారంభించారు. 2014లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వైకుంఠ మాల పేరుతో ఈ ఔటర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. అప్పట్లో ఇది ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిని పక్కన పెట్టేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరుపతిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరం రూపు రేఖలు మార్చేయాలని చూస్తోంది. అందుకే రోడ్ల అభివృద్ధితోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న తిరుపతికి భక్తులతోపాటు



పర్యాటకులు భారీగా తరలి వస్తుంటారు. వచ్చిన వాళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేలా ట్రాఫిక్‌లో సమయం వృథా కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన మళ్లీ తెరపైకి తెచ్చింది. ఇది పూర్తి అయితే తిరుపతికి కొత్త కళ వస్తుందని అంటున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. టెండర్లు పిలవనున్నారు.

# రైతులకు రుణాలు పెంపు అవసరం

--కలెక్టర్ జి.రాజకుమారి గణియా--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 12 :?రైతులు, స్వయం ఉపాధి లబ్ధిదారులకు రుణాలు వేగంగా మంజూరు చేసి ఆర్థికంగా బలపరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బ్యాంకర్లను సూచించారు. జిల్లా రుణ లక్ష్యాల్లో ఇంకా పెద్ద భాగం మిగిలి ఉందని, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. సౌర ఫలకాల పథకంలో పురోగతి తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసి, గ్రామాలవారీగా లక్ష్యాలు పెట్టి 100 శాతం ఇళ్లకు ఫలకాలు అమర్చాలని సూచించారు. ఉపాధి, విద్యా, గృహ రుణాల మంజూరులో వేగం పెంచాలని, వివిధ పథకాలలో లబ్ధిదారుల ఈ?కెవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు గోదాములు, వడకట్టే మైదానాల ఏర్పాటుకు పెట్టుబడులు?రుణాలపై కూడా బ్యాంకులు దృష్టి పెట్టాలని కోరారు.

# ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం తప్పనిసరి--


కలెక్టర్ జి రాజకుమారి గణియా--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ డిసెంబరు 12 :?జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సెల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని, నిర్ణీత గడువులో ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ప్రజల సంతృప్తి శాతం 82.27గా ఉన్నదని, ఈ శాతాన్ని మరింత పెంచేందుకు అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంలో పారదర్శకత, వేగం, నాణ్యత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీలను కేవలం క్లోజ్ చేయడం కాకుండా, సమస్య క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతర ఫాలోఅప్ చేయాలని ఆమె ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం మెరుగుపరచి, ప్రజలకు భరోసా కలిగించే విధంగా సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, టీమ్ సభ్యులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 12-నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివస్ (గ్రీవెన్స్ డే) ను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. సిబ్బంది వినతులను పూర్తిగా విని, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా నిచ్చారు. సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, వారి సమస్యలను తొలగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామన్నారు ఎస్పీ.




# ప్రజా వేదికలో సమస్యలు పరిష్కారం--

## అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 12-పట్టణ ప్రజలు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలంటే ప్రజా సమస్యల పరిష్కారం వేదికను పూర్తిగా వినియోగించుకోవాలని నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ప్రభుత్వ పరిపాలనను మరింత ప్రజల దగ్గరకు తీసుకెళ్లేందుకు ఈ వేదికను ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. అర్బన్ ప్రాంతంలో రెవెన్యూ, సర్టిఫికేట్ల జారీ, కుటుంబ సభ్యుల వారసత్వ నమోదు, పేరు సవరణలు, పుట్టిన?మరణ నమోదు లోపాలు, భూస్వామ్య



హక్కుల నిర్ధారణ, పద్దెనిమిది?ఏ జారీ, మ్యూటేషన్ వంటి అంశాలపై ప్రజలకు తరచుగా సమస్యలు వస్తున్నాయని, ఇవన్నీ ప్రజా వేదికలో సమర్పిస్తే త్వరితగతిన పరిష్కారం అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ప్రజల నుండి వచ్చే ప్రతి వినతి పత్రాన్ని అధికారులు నేరుగా విని, ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేసే విధానం అమలు చేస్తున్నామని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగడం, చిన్న చిన్న పనుల కోసం రోజులు కోల్పోవడం, అనవసర ఖర్చులు పెట్టడం వంటి సమస్యలను తగ్గించేందుకు ప్రజా వేదిక ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. పరిష్కారం కోసం అవసరమైతే ఇతర శాఖలతో కూడా సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని, ఆలస్యం అయ్యే పనులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు నిజాయితీగా, పారదర్శకంగా సేవలు అందించడమే రెవెన్యూ శాఖ లక్ష్యమని తహసీల్దార్ స్పష్టం చేశారు. అర్బన్ నివాసితులందరూ తమ సమస్యలను ప్రజా వేదికలో తెలియజేసి సమయానికి పరిష్కారం పొందాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. ఎక్కువ మంది పాల్గొంటే సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని ఆయన అన్నారు.

# డిసెంబర్ 21 వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి


కర్నూలు , డిసెంబర్ 12 :-జిల్లాలో డిసెంబర్ 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కు సంబంధించి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ...5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలందరికీ పోలియో వ్యాక్సిన్ ఇవ్వాలన్నారు. డిసెంబర్ 21 వ తేదీన బూత్ స్థాయి లో పోలియో చుక్కలను వేస్తారని, ఆ రోజు మిస్ అయిన పిల్లలకు 22,23 తేదీల్లో రోజులు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు అయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. గుడి, మసీదు, చర్చి లతో పాటు నాలుగు రోడ్ల కూడలిలో, తదితర ప్రదేశాల్లో ఆటోల ద్వారా చేయాలని, అలాగే కేబుల్ టీవీ ద్వారా ప్రచారం చేయించాలని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లు, ఎంపిడిఓ లను ఆదేశించారు. ఐసిడిఎస్ శాఖకు సంబంధించి అంగన్వాడీ టీచర్లు ఆశా, ఏఎన్ఎం ల సేవలు వినియోగించుకొని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ముందుగానే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియచేసేలా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారిని ఆదేశించారు. మిస్ అయిన పిల్లలకు మరుసటి రోజు ఇంటింటికీ వెళ్ళి పోలియో చుక్కలు వేయించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీల ద్వారా టామ్ టామ్ ద్వారా తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిపివో ను ఆదేశించారు.. ఎంపిడిఓ లు, తహసీల్దార్లు, సచివాలయ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు, ఎన్జీవో లు, మహిళా సంఘాల సభ్యులు అందరూ ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా తగిన చర్య లు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రయాణం చేస్తున్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించే ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ , డిఎంహెచ్వో డాక్టర్ భాస్కర్ , ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా ,జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ నూకరాజు , కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ , డిపిఓ భాస్కర్, డీఈవో సుధాకర్ , డ్వామా పిడి వెంకటరమణయ్య , లయన్స్ క్లబ్ తరఫున రాయపాటి శ్రీనివాసరావు , ఐఎంఏ తరఫున డాక్టర్ మనోజ్ కుమార్ , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్ బాబు , ఎన్టీఆర్ ఆరోగ్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి , రైల్వే హెల్త్ సూపరింటెండెంట్ మణిమాల, ఐసిడిఎస్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

ఏలూరు, డిసెంబర్ 12,ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. చింతూరు ఘాట్ రోడ్‌లో ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందారని తెలుస్తోంది. నలుగురు పురుషులుఐదుగురు మహిళలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. మారేడుమిల్లి తులసి పాకల వద్ద ఈ ప్రమాదం జరిగింది. బస్సు చింతూరు నుంచి మారేడుమిల్లి వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 37 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే చింతూరు నుంచి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన బస్సు నంబర్ ఎపి 39 జిఓ 6543 అని అధికారులు తెలిపారు. చిత్తూరు నుండి కోటప్పకొండ,అమరావతి, మంగళగిరి,విజయవాడ, ద్వారకాతిరుమల, పాలకొల్లు, భీమవరం, పెనుగొండ, అంతర్వేది, ద్రాక్షారామం,సామర్లకోట, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, అరకు మీదుగా యాత్రికులు భద్రాచలం వెళ్తున్నారు. ట్రావెల్స్ బస్సులో బెంగుళూరుకు చెందిన 12 మంది, మిగతా వారు చిత్తూరుకు చెందిన వారు ఉన్నారని సమాచారం. బస్సు ప్రమాదం కారణంగా చింతూరు-మారేడుమిల్లి మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నాయి. ప్రమాదానికి గురైన బస్సు చిత్తూరు జిల్లాకు చెందిన విఘ్నేశ్వర ట్రావెల్స్ బస్సుగా గుర్తించారు. బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రిగ్ర్భ్భాంతిఅల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, తులసిపాకలు ఘాట్ రోడ్‌లో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడుగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు. భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తున్న యాత్రికుల ప్రైవేటు బస్సు లోయలో పడిన ఘటనలో పలువురు మృతి చెందడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు వెంటనే అధికారులతో మాట్లాడి, బస్సు ప్రమాదం వివరాలు, క్షతగాత్రులకు అందుతున్న సహాయం గురించి ఆరా తీశారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నారని, పలువురు మృతి చెందగా, గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించడానికి వారిని ఇతర ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఘటనా స్థలానికి తక్షణం వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఏపీ సీఎం ఆదేశించారు.

# ప్రజా వేదికను వినియోగించుకోండి: కమిషనర్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 12- పట్టణ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు మున్సిపాల్టీ కట్టుబడి ఉందని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా వేదిక ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చని అన్నారు. ప్రజా వేదికలో ప్రధానంగా ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు



సంబంధిత శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్న చిన్న పనుల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని, మున్సిపాల్టీలో దరఖాస్తు చేస్తే త్వరిత పరిష్కారం లభిస్తుందని కమిషనర్ చెప్పారు. పరిష్కారం కాని అంశాలను ఉన్నతస్థాయి అధికారులకు నివేదించి మార్గం సుగమం అయ్యేలా చర్యలు తీసుకుంటామని శేషన్న తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా వేదికను పట్టణ ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ ఇకలేరు



ముంబయి: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్(90) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. శివరాజ్ పాటిల్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. శివరాజ్ పాటిల్ మృతి తనను కలిచివేసిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. లాతూరు ప్రాంతంలోని చాకూర్ గ్రామంలో 1935 అక్టోబర్ 12న జన్మించారు. అప్పట్లో లాతూరు హైదరాబాద్ స్టేట్‌లో ఉంది. బాంబే యూనివర్సిటీలో పిజి చేశారు. 1963లో విజయ పాటిల్‌ను వివాహం చేసుకున్నారు. శివరాజ్ పాటిల్, విజయ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. లాతూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఏడు సార్లు ఎంపి గెలిచి ప్రజలకు సేవలందించారు

# తత్కాల్ టికెట్ల జారీ విషయంలో తాజా మార్పులు, ఆ ఖాతాలు డీయాక్టివేట్..!!

తత్కాల్ టికెట్ల జారీ విషయంలో రైల్వే శాఖ వరుసగా కీలక మార్పులు చేస్తోంది. నకిలీలకు చెక్ పెట్టి.. ప్రయాణీకులకు వెసులుబాటు కలిగించేలా కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే పలు మార్పులు అమలు చేస్తోంది. ఆధార్ ఆధారిత ాఖ ధృవీకరణను తీసుకొచ్చింది. దీంతో పాటుగా మరి కొన్ని చర్యలకు సిద్ధమైంది. ఇదే సమయంలో పార్లమెంట్ వేదికగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేసారు. తత్కాల్ టికెట్ల విషయంలో ప్రయాణీకులకు మెరుగైన విధానం అమల్లోకి తెస్తున్నట్లు రైల్వే మంత్రి ప్రకటించారు. సేవల విషయంలో అవసరమైన మార్పులు చేస్తున్నామని చెప్పారు. తాజాగా తీసుకుంటున్న చర్యల కారణంగా ప్రయాణీకుల నుంచి మద్దతు లభిస్తుందని వివరించారు. తత్కాల్ టికెట్ల విషయంలో వస్తున్న ఫిర్యాదులు.. సూచనలకు అనుగుణంగా కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో సామాన్యులకు సాధారణ, తత్కాల్ టికెట్లు అందేలా రిజర్వేషన్ వ్యవస్థ తీర్చి దిద్దేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. తత్కాల్ వ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఆధార్ బేస్డ్ ఓటీపీ వ్యవస్థను దశల వారీగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం 322 రైళ్లకు దీనిని వర్తింప చేసామని చెప్పారు. దీన ద్వారా ఆయా రైళ్లల్లో తత్కాల్ టికెట్ల సమయం దాదాపు 65 శాతం మేర పెరిగిందన్నారు. అదే విధంగా రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్స్ కు ఓటీపీ వెరిఫికేషన్ విధానాన్ని డిసెంబర్ 4వ తేదీ వరకు 211 రైళ్లకు వర్తింప చేసినట్లు వివరించారు. దీని కారణంగా 96 పాపులర్ రైళ్ల టికెట్ల అందుబాటు సమయం 95 శాతం మేర పెరిగిందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. తత్కాల్ టికెటింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేవారిపై ప్రభుత్వం గట్టి నిఘా ఉంచిందని చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190